


# మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతి

- మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో ఘటన

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 19 : భద్రతా దళాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ్‌పూర్ జిల్లా ఇర్కభట్టి, ఓర్చా, మోహండీ నుంచి ఐటీబీపీ, సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ భద్రతా దళాలు సంయుక్తంగా మావోయిస్టుల నిర్మూలన ఆపరేషన్ నిమిత్తం దుర్భేడా అడవులకు వెళ్లి తిరిగి పయనమయ్యాయి. ఈ క్రమంలో కొడలియార్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఇద్దరు జవాన్ల పరిస్థితి విషమించి మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఐటీబీపీ 53వ బెటాలియన్ జవాన్లలో మహారాష్ట్ర రాష్ట్రం సతారా జిల్లాకు చెందిన అమర పన్వార్(36), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపకు చెందిన కే.రాజేశ్(36) మృతిచెందిన వారిలో ఉన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీస్ అధికారులు సమీప అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు.

### కాంగ్రెస్ నాయకుడి హత్య

కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల ఉపాధ్యక్షుడిని అతి దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శనివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా ఉసూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తిరుపతి బండారి ఆ ప్రాంతంలో సొసైటీ కార్యక్రమం కోసం వెళ్లాడు. ఈ క్రమంలో ఒంటరిగా దొరికిన తిరుపతిని మావోయిస్టులు అపహరించి సమీప ప్రాంతంలోకి తీసుకెళ్లి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఉసూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 19: మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలపై అసంతృప్తితో ఉన్న నాయకులు, సభ్యులు లొంగు'బాట' పడుతున్నారని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు తెలిపారు. మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యులు(ఏసీఎం) ఇద్దరు, ఒక దళ సభ్యుడు జిల్లా పోలీస్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అధికారుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో ఇలా వెల్లడించారు. 'మావోయిస్టు పార్టీ చర్ల ఏరియా కమిటీ సభ్యులైన పోడియం మంగు, మడివి అడిమె, దళ సభ్యుడు కుడం సోమల్ స్వచ్ఛందంగా లొంగిపోయారు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న 'ఆపరేషన్ చేయూత'తో మావోయిస్టు పార్టీ నాయకులు, దళ సభ్యులు, మిలీషియా సభ్యులు, సానుభూతిపరులు ఆకర్షితులవుతున్నారు. స్వేచ్ఛాయుత జీవనం గడిపేందుకు లొంగిపోతున్నారు. మావోయిస్టులు తమ సమీప పోలీస్ స్టేషన్‌లోగానీ, బంధువులు/సన్నిహితుల ద్వారాగానీ, నేరుగాగానీ పోలీస్ ఉన్నతాధికారుల ముందుకు వచ్చి లొంగిపోవచ్చని సూచించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున అన్ని రకాల ప్రయోజనాలను అందించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుంది'.

## ఆత్మ విశ్వాసంతో ఎదగాలి

చుంచుపల్లి, అక్టోబర్ 19: బాలికలు ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తూ, అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని జడ్జి భానుమతి ఆకాంక్షించారు. మండలంలోని బాబూక్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లింగ సమానత్వంతో ఉన్నతంగా రాణించవచ్చని అన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పురుషోత్తంరావు, నిరంజన్‌రావు, నాగ స్రవంతి, జ్యోతి విశ్వకర్మ, హెచ్‌ఎం నీరజ పాల్గొన్నారు.



















